క్లుప్తంగా

కళాశాలలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.ప్రకాష్‌రావు పట్నాయక్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు బుధ వారం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగ వల్లులు, భోగి మంట వేసి విద్యార్థులు సందడి చేశారు.

ఓం సదనంలో రుద్రహోమం



108 శివలింగాలకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కొత్తవలస: తుమ్మికాపల్లి గేటు సమీపంలోని ఓం సదనంలో పుష్యమాస మాస శివరాత్రి సందర్భంగా బుధవారం మహాన్యాస పూర్వక రుద్రహోమం నిర్వహించారు. అర్చకులు అంపోలు ఉమా మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో 108 శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్క గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత



బీమా పరిహారం మంజూరు పత్రాలను బాధితురాలికి అందజేస్తున్న ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్

మెరకముడిదాం: స్థానిక ఏపీజీవీబీలో ఖాతాదారుడు, మండలంలోని ఊటపల్లి గ్రామానికి చెందిన మండల గౌరినాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏపీజీవీబీలో గతంలో బీమా చేయించుకోవడంతో ఆయన భార్య, నామినీ అయిన అప్పలనరసమ్మ ఖాతాలో ఏపీజీవీబీ ప్రమాద బీమా కింద రూ.10 లక్షల పరిహారం జమచేసింది. సంబంధిత పత్రాలను ఆ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్ బాధితురాలు అప్పలనరసమ్మకు బుధవారం అందజేశారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విజినిగిరిలో ఆయుర్వేద వైద్యశిబిరం



సేవలందిస్తున్న వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు

జామి: విజినిగిరి గ్రామంలోని యోగా కేంద్రంలో ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కొవ్వాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 60 మందికి ఆయుర్వేద వైద్యుడు జగన్‌మోహనరావు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆ సంఘం కార్యదర్శి ఏ.జి.తాతారావు,ఉపాధ్యాయులు సూర్యారావు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలో ఓటువేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

లక్కవరపుకోట: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎంలు)పై ప్రజల్లో అపోహలు తొలగించేందుకు, ఈవీఎంలో ఓటు వినియోగించుకునే విధానంపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వీరభద్రపేట గ్రామంలో ఓటర్లకు తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఓటే వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సూచించారు. పలువురు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మంటలను అదుపుచేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఓ రవిప్రసాద్

గజపతినగరం: అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గజపతినగరం మధుర గ్రామం ఎం.వెంకటాపురంలోని శ్రీకృష్ణ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీకేజిలు వల్ల వచ్చే మంటలను అదుపు చేసే విధానం, తదితర అంశాలపై అగ్నిమాపకశాఖ అధికారి(ఎస్‌ఎఫ్‌ఓ) ఎం.ఎస్.వి.రవిప్రసాద్ ఫైర్ సిబ్బందితో కలిసి ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..

ఆడుదాం-ఆంధ్రా

- ప్రారంభమైన మండలస్థాయి 'ఆడుదాం- ఆంధ్రా' పోటీలు



కొత్తవలస: బలిఘట్టాం సమీపంలోని ప్రగతి డిఫెన్స్ అకాడమీ మైదానంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం- ఆంధ్రా' పేరిట మెగా టోర్నమెంట్ నిర్వహిస్తోందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. 'ఆడుదాం-ఆంధ్రా' మండల స్థాయి క్రీడా పోటీలు ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ (డబుల్స్) క్రీడాంశాల్లో తొలి దశలో జరిగిన గ్రామ సచివాలస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు మండలస్థాయి పోటీల్లో తలపడుతున్నారు. ప్రభుత్వం సమకూర్చిన స్పోర్ట్స్ టీషర్టులను క్రీడాకారులకు ప్రజాప్రతినిధులు, నాయకులు అందజేశారు.

– కొత్తవలస/లక్కవరపుకోట/ చీపురుపల్లి/ జామి/దత్తిరాజేరు/ శృంగవరపుకోట/ గజపతినగరం / చీపురుపల్లిరూరల్(గరివిడి)/ వేపాడ



కొత్తవలస: బలిఘట్టాంలో బాలికల వాలీబాల్ పోటీలు



చీపురుపల్లి: చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాకారులతో జెడ్పీటీసీ శిరీష తదితరులు



గజపతినగరం: గజపతినగరం జూనియర్ కళాశాలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ జ్ఞానదీపిక



శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాలలో భర్తాపురం కబడ్డీ క్రీడాకారులతో తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు



కొత్తవలస: బలిఘట్టాంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



లక్కవరపుకోట: ఎల్.కోట చెరుకుకాటా వద్ద నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ శ్రీనివాసరావు



చీపురుపల్లిరూరల్(గరివిడి): కోనూరులో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో సెమీఫైనల్‌కు చేరుకున్న అర్తమూరు జట్టు



శృంగవరపుకోట: ఎస్.కోటలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులతో ఎంపీడీఓ శేషుబాబు తదితరులు



దత్తిరాజేరు: మరడాం ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీరాజేశ్వరి



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన కొండపాలెం సచివాలయం-3 జట్టు



వేపాడ: వేపాడ హైస్కూల్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ సత్యవంతుడు



జామి: జామిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ గంగరాజు

మాటతప్పని వ్యక్తి సీఎం జగన్



శృంగవరపుకోట: కృష్ణాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



చీపురుపల్లిరూరల్: మెట్టపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు అనంతం, శ్రీనివాసనాయుడు



బొండపల్లి: ఒంపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ,నాయకులు

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాటతప్పని వ్యక్తి అని ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సర్పంచ్ మేరపు రెడ్డి యామినీదేవి అధ్యక్షతన నూతన, పెంచిన పెన్షన్లను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక భద్రత పింఛన్‌ను సీఎం జగన్ రూ.3 వేలకు పెంచారన్నారు. ప్రతీ పేదింటికి పెద్ద దిక్కులా సీఎం జగన్ నిలిచారని అన్నారు. ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, ఎంపీటీసీ బి.దేముడు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

చీపురుపల్లిరూరల్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలి రెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. మండలంలోని మెట్టపల్లి, కర్లాం పంచాయ తీల్లో లబ్ధిదారులకు పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షే మం కోసం పాటు పడుతున్న సీఎం జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు, నాయకులు మీసాల పైడి తల్లి, బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: చింతలపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

దేశంలో ఎక్కడా లేని విధంగా..

బొండపల్లి: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో అవ్వా,తాతలు, వితంతువులు, దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3 వేల పింఛన్ అందజేస్తోందని, ఈ ఘనత సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం అన్నారు. ఒంపల్లి గ్రామ సచివాలయంలో లబ్ధి దారులకు పింఛన్ డబ్బులను బుధవారం పంపిణీ చేశారు. ఒంపల్లి,వేండ్రాం గ్రామాల సర్పంచ్‌లు లండా నారాయణమ్మ, కర్రోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల మండలంలో..

గుర్ల: మండలంలోని చింతలపేట, పాలాయవలస, కెల్లలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక నేతలు పతివాడ భాస్కరరావు, మొల్లి అప్పన్న, కె.వి.సూర్యనారాయణరాజు, కెల్ల లక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ పింఛన్‌ను పెంచారని వారు అన్నారు.

గొల్లలపేటలో డయేరియా

బొండపల్లి: మండలంలోని గొల్లలపేట గ్రామంలో పలువురు డయేరియా బారిన పడడంతో గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. గ్రామానికి చెందిన సారాది పాపారావుకు స్కూల్‌లోనే వైద్యసేవలు అందించగా చెందిన మరో ఇద్దరు బాధితులు పీతల కోండమ్మ, పీతల అప్పయ్యమ్మలను పరీక్షించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం పీహెచ్‌సీకి తరలించినట్లు వైద్యాధికారిణి సమీర తెలిపారు. అలాగే స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి జ్వరంతో బాధపడుతూ వచ్చిన పీతల దానయ్య, లక్ష్మి, కొండమ్మ, అప్పల కొండమ్మలకు వైద్యులు చికిత్స అందజేశారు. పీతల ఎర్రమ్మ, కొండమ్మ, అప్పయ్యమ్మ, సుంకరి అప్పారావు, బొట్టా రాజమ్మ, ఎం.కృష్ణమ్మలు డయేరియా లక్షణాలతో బాధపడుతుండగా వైద్యులు చికిత్స అందించిన అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు. గ్రామంలోని మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు, మంచినీటి ట్యాంకులో క్లోరినేషన్ పనులు చేపట్టినట్లు సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం అందరి పరిస్థితి బాగానే ఉందని బొండపల్లి 2సచివాలయం హెల్త్‌వెల్‌నెస్ కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ లోవలక్ష్మి చెప్పారు.



డయేరియా బాధితుడు పాపారావుకు వైద్యసేవలు అందిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటుకు సంఘీభావం

వేపాడ: విజయవాడలోని స్వరాజ్ మైదానంలో రూ.400 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ స్మృతివనాన్ని ఏర్పాటు చేసింది.ఈస్మృతివనంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఈనెల19న ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం తమ సంఘీభావం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ సత్యవంతు డు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ జి.ఉమ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతకాల సేకరణ చేశారు.



వేపాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంతకాలు చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, అధికారులు

సేవా కార్యక్రమాలు విస్తృతం చేద్దాం




మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ వంశీకృష్ణ

చీపురుపల్లి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేద్దామని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ బెల్లాన వంశీకృష్ణ సభ్యులకు చెప్పారు. పట్టణంలో లయన్స్‌క్లబ్ జోన్ సోషల్ సమావేశాన్ని బుధవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ నేతృత్వంలో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. జోన్ పరిధిలో ఉన్న ఆరు క్లబ్‌ల పురోగతిపై సమీక్షించారు. క్లబ్ సభ్యులు అంతా ఉత్సాహం గా పని చేయాలని సూచించారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆరోగ్యకర పోటీతత్వం ఉండాల న్నారు. స్టార్స్ క్లబ్‌లు కూడా చురుగ్గా పని చేయాలన్నారు. క్లబ్‌ల్లో సభ్యులను అధిక సంఖ్యలో చేర్పించాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచిత వైద్యసేవలు అందించాలన్నారు. శ్రీరామ్‌నగర్ లయన్స్‌క్లబ్ పీడీజీ ఎం.ఎస్.ఎస్.శర్మ, జోన్ సభ్యుడు ఎస్.సన్యాసిరావు, చీపురుపల్లి లయన్స్, స్టార్స్ క్లబ్‌ల అధ్యక్షులు ఎస్.వి.జి.శ్రీనివాసరావు, సూరు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి కోర్టు ప్రాంగణంలో ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యూ.ఎస్.శర్మ మాట్లాడుతూ సహజ న్యాయచట్టాలకు విరుద్ధంగా ఉన్న ఈచట్టంతో స్థానిక కోర్టులకు విచారణ పరిధి లేకుండా చేశారన్నా రు. టైటలింగ్ అధికారులకే అధికారం ఇవ్వడం వల్ల వారిపై రాజకీయ జోక్యం పెరిగే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన వాజ్యాలు ఉంటే హైకోర్టులో అప్పీలు చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు పడతా రన్నారు. న్యాయవాదులు, బి.త్రిమూర్తులు, ఎం.చంద్రశేఖర్, టి.వి.ఆర్.మూర్తి, జి.చిట్టిబాబు, బి.సత్యనారాయ ణ, ఆర్.సత్యనారాయణ, బి.వి.ఎస్.రామారావు, ఎం.అప్పారావు, సంతోష్, బి.వెంకటరావు, బొబ్బిలి రామకృష్ణ పాల్గొన్నారు.



ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయితీపై డ్రిప్, స్పింకర్ల పరికరాలు

వేపాడ: ప్రభుత్వం రాయితీపై రైతులకు బిందు, తుంపర సేద్యం పరికరాలు డ్రిప్‌లు, స్ప్రింకర్లను అందజేస్తోందని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని బల్లంకి గ్రామంలో ఓ రైతు పొలంలో అమర్చిన తుంపర సేద్యం పరికరాల(స్పింకర్లు) యూనిట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాప్, స్ప్రింకర్లతో తక్కువనీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేయవచ్చన్నారు. రాయితీపై అందజేసే ఈ పరికరాల కోసం రైతులు తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.



స్పింకర్ల యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: మండలంలోని గత్సలవలస విద్యుత్ ఉప కేంద్రంలో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ భీమరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత్సలవలస విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని కర్లాం, గత్సలవలస, అలజంగి, మెట్టపల్లి, పేరిపి, నిమ్మలవలస తదితర గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చల్లపేట ఫీడర్ పరిధిలో...

గజపతినగరం: చల్లపేట ఫీడర్ పరిధి గ్రామాలకు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ బొబ్బిలి ఈఈఓపీ ఏ.అనంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో పురిటిపెంట,ఎం.వెంకటాపురం, దావాలపేట, బూడిపేట, గంగచోళ్ల పెంట, పట్రువాడ, సాలిపేట, కొనిశ, మర్రివలస, భూదేవిపేట, బంగారమ్మపేట, పాతభగ్గాం, కొత్తభగ్గాం, చిట్టాయవలస గ్రామాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

12, 13వ తేదీల్లో..

గంట్యాడ: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 13వ తేదీ రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈ పీడీసీఎల్ ఈఈ పూడి హరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రాయిపూర్ విశాఖపట్నం ఆరు లైన్ల హైవే పనుల్లో భాగంగా కొర్లాం-కంటకాపల్లి మధ్య 500 కేవీ విద్యుత్ లైన్ మార్పు పనులు చేపట్టనున్న నేపథ్యంలో గంట్యాడ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. దీంతో గంట్యాడ సబ్‌స్టేషన్ పరిధి గంట్యాడ, కొఠారుబిల్లి, నరవ, బుడతానపల్లి, గింజేరు, జగ్గాపురం,లక్కిడాం, సిరిపురం,పెదవేమలి, వసంత, గింజేరు, కొర్లాం, పెంట శ్రీరాంపురం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీమా తక్షణ సహాయం అందజేత

చీపురుపల్లిరూరల్: మండలంలోని పుర్రేయవలస గ్రామానికి చెందిన గురాన పార్వతి ఇటీవల పాము కాటుతో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా రూ.10 వేలును వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు బుధవారం అందజేశారు. మిగతా రూ.4,90,000 నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని నాయకులు చెప్పారు. స్థానిక నాయకులు కంది పాపినా యుడు, కంది అప్పారావు, కంది శ్రీరాములు,జమ్ము అప్పలనాయుడు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట: అనుమతులు లేకుండా, అధికారులకు సమాచారం ఇవ్వకుండా పంచాయతీకి చెందిన చెట్లను అక్రమం గా నరికేస్తున్న వారిపై వాల్టా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానిక 'జియో' స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, న్యాయవాది బి.రామకృష్ణ తహసీల్దార్ శ్రీనివాసరావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా వెంకటేశ్వర థియేటర్ అత్యవసర మార్గానికి ఇరువైపులా ఉన్న పంచాయతీకి చెందిన చెట్లను కోటంశెట్టి దేముడమ్మ అక్రమంగా నరికివేయించారని పేర్కొన్నారు. చెట్ల నరికివేతలో జోక్యం ఉన్న వాళ్లందరిపైనా కేసు నమోదు చేయాలని కోరారు.